# భక్త ప్రహ్లాదుని కథ

## వైష్ణవి ఆదిమత్యం

## హిరణ్యకశిపుని తపస్సు

శ్రీహరి వరాహరూపంలో హిరణ్యాక్షుని వధించాడని తెలుసుకున్న హిరణ్యకశిపుడు ఉగ్రుడై శ్రీమన్నారాయణున్ని వధించాలని నిశ్చయించుకొని బ్రహ్మను స్మరిస్తూ కఠోర తపస్సు ఆరంభించాడు. నూఱు దివ్య సంవత్సరాలు కేవలం గాలి పీల్చుకుంటూ తపస్సు ఇంకా ఉధ్రుతం చేశాడు. హిరణ్యక శిపుని తపోదీక్షకు హంసవాహనం మీద భక్తుని ముందు ప్రత్యక్షమై బ్రహ్మ వరం కోరుకోమన్నాడు.

హిరణ్యకశిపుడు అస్త్రంవల్లకానీ, శస్త్రంవల్లకానీ, మానవుల వల్లకానీ, మృగాలవల్ల కానీ, రాత్రి సమయంలో కానీ, పట్ట పగలు కానీ, భూమిమీద కానీ, ఆకాశంలో కానీ, ఇంట్లోకానీ, ఆరుబయట కానీ, నాకు మరణం లేకుండా వరాన్ని అనుగ్ర హించమని కోరుకున్నాడు. భక్తుని తపోదీక్షకు, స్తుతికి పారవశ్యం చెందిన చతుర్ముఖుడు "తథాస్తు" అని దీవించి అంతర్ధానం చెందాడు.

## ప్రహ్లాదుని పుట్టుక

హిరణ్యకశిపుడు బ్రహ్మగురించి తపస్సు ఆరంభించేనాటికి అతని భార్య లీలావతి గర్భవతి. హిరణ్యకశిపుని తపోదీక్షకు ఇంద్రుడు భీతిచెంది తపోభంగం కలిగించే దురుద్దేశంతో లీలావతిని చెరపట్టాడు.

ఇంద్రుడు నారదుని మాటలు విని లీలావతిని అతనికి అప్పగించాడు. దేవరుషి ఆమెను తన ఆశ్రమానికి తీసుకొని పోయి ఆమె గర్భంలో ఎదుగుతున్న శిశువుకు నారదుడు శ్రీమన్నారాయణ మంత్రాన్ని ఉపదేశించాడు. గర్భస్థ శిశువుకు శ్రీహరి కథలు ఎన్నో వినిపించాడు. బాహ్య ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ముందే ఆ బాలుణ్ణి విష్ణుభక్తునిగా తీర్చిదిద్దాడు నారదుడు. లీలావతికి ప్రసవకాలం సమీపించి మంచి శుభ ముహూర్తంలో ఒక బాలుణ్ణి ప్రసవించింది. అతడే ప్రహ్లాదుడు.

## హిరణ్యకశిపుడు దేవతలపై దండెత్తుట

గొప్ప తపస్సుచేసి, వరములు పొంది అంతఃపురానికి వచ్చిన హిరణ్యకశిపుడికి లీలావతి కనపడలేదు. నారదుడు విషయం తెల్పి బిడ్డతో సహా లీలావతిని తెచ్చి అతనికి అప్పగించాడు. లీలావతి జరిగినదంతా భర్తకు చెప్పింది. సమయానికి తన భార్యనూ, బిడ్డనూ కాపాడినందుకు హిరణ్యకశిపుడు నారదుణ్ణి ఎంతో మెచ్చుకున్నాడు. "ఇన్నాళ్ళూ నాకు ఆ విష్ణువొకడే శత్రువను కున్నాను. ఇంద్రుడు కూడా యింత నీచంగా ప్రవర్తిస్తాడా? ఇప్పుడే వెళ్ళి వాడికి గుణపాఠం నేర్పుతాను" అని తన సైన్యాన్ని తీసుకుని స్వర్గం మీద యుద్ధానికి బయలుదేరాడు.

ఈవిధంగా దేవతలని అన్నిలోకాలనుండి తరిమి, హిరణ్యకశిపుడు సరాసరి వైకుంఠానికి వెళ్ళాడు. భక్తులకూ, యోగులకూ సాత్త్వికులకూ తప్ప వైకుంఠం యితరులకు కనిపించదు. అది తెలియని హిరణ్యకశిపుడు విష్ణువు తనకు భయపడి పారిపోయాడని అనుకొని విజయ గర్వంతో తన నగరం చేరాడు. అక్కడితో ఆగకుండా విష్ణు భక్తులందర్నీ చిత్రహింసలు చేయ సాగాడు. తానే దేవుడినన్నాడు. ప్రార్థనలు, పూజలూ అన్నీ తనకే చేయాలని శాసనం చేశాడు. బలవంతుడూ, ధనవంతుడు తలచుకుంటే జరగనిదేముంటుంది? అన్నీ అతని ఆజ్ఞానుసారమే జరిగాయి.

హిరణ్యకశిపుడు తన గురువును పిలిపించి తన కుమారునికి అన్ని విద్యలు నేర్పమని ప్రహ్లాదుని వారి వెంట పంపించాడు. రాక్షస గురువైనట్టి చంఢామార్కుల వారు ప్రహ్లాదుని తీసుకొని తన ఆశ్రమానికి వెళ్ళాడు. అందరికి విద్య నేర్పినట్లే ప్రహ్లాదునికి కూడా విద్యను బోధించసాగాడు. ఆ చదువులతో పాటు ప్రహ్లాదుడు విష్ణునామ జపం కూడా సాగిస్తున్నాడు. తన తండ్రికి శత్రువైన విష్ణునామ జపం చేస్తున్నాడని గ్రహించి చంఢామార్కుల వారు ప్రహ్లాదునిలో ఎంతో మార్పు తేవాలని ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కాని ఫలితం లభించలేదు. ఛండా మార్కుల వారు ఈ విషయాన్ని హిరణ్యకశిపునికి తెలియజేశాడు.

హిరణ్యకశిపుడు ఉగ్రుడై చేయునది లేక చివరకు ప్రహ్లాదుని తానే తన దారికి తెచ్చుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు. ఫలితం శూన్యం. ప్రహ్లాదుని దండనతో దారి మళ్ళించవచ్చునని భావించి విష్ణుభక్తిని విడిచిపెట్టేవరకు శిక్షించమని భటులకు ఆదేశాలు ఇచ్చాడు. దండోపాయం కూడా విష్ణుభక్తి ముందు దాసోహం అంది. చివరకు ప్రహ్లాదునికి తనే బుద్ధి చెప్పి తన దారికి తేవాలనుకున్నాడు. ఒకనాడు సభా మండపంలో కూర్చొని ప్రహ్లాదునితో ఏకాంతంగా మాట్లాడాలని తన వద్దకు పిలిపించుకున్నాడు. ప్రహ్లాదుడు వచ్చి తండ్రి ముందు వినయంగా నిలబడ్డాడు. "నాయనా ప్రహ్లాదా! విష్ణువు మనకు విరోధి. మనకన్నా వాడు చాలా తక్కువ. నాకు భయపడి ఏ లోకాలకో వెళ్ళి దాక్కున్నాడు. పిరికిపంద" అని తల నిమురుతూ "నీవు హరిని ధ్యానించడం మానుకొను నాయనా!" అన్నాడు అప్యాయతగా. "తండ్రీ! మీరు పొరపడుతున్నారు. మన అందరికీ దైవం ఆ శ్రీహరే! ఆయన సర్వాంతర్యామి. నీలోనూ, నాలోనూ ఈ విశ్వమంతటా ఉన్నాడు" అన్నాడు ప్రహ్లాదుడు.

ఆ మాటలు విన్న హిరణ్యకశిపుడు వీరావేశంతో గద చేత బట్టి "అయితే ఈ స్థంభంలో కూడా ఉంటాడా?" అని అర్థం లేని విధంగా ప్రశ్నించాడు. అందుకు ప్రహ్లాదుడు శాంతంతో "శ్రీహరిని సర్వాంతర్యామిగా ధ్యానిస్తున్నాను కనుక తప్పక ఈ స్థంభంలో ఉంటాడు" అన్నాడు ప్రహ్లాదుడు. వర గర్వితుడైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని నమ్మకాన్ని భంగపర్చాలనే ఉద్దేశ్యంతో "ప్రహ్లాదా! నీవు కొలిచే ఆ శ్రీహరిని ఈ స్థంభంలో చూపించు" అని తన చేతిలో ఉన్న గదా దండంతో ఆ స్థంభాన్ని బలంగా మోదాడు.

## నరసింహ రూపంలో శ్రీహరి ప్రత్యక్షం

హిరణ్యకశిపుని గద దెబ్బకు సభామండపంలో వున్నస్తంభం పెద్ద శబ్ధంతో మధ్యకు చీలి అందులోంచి బయంకరంగా వికటాట్టహాసం చేస్తూ శ్రీహరి నరసింహస్వామి రూపంలో ఉద్భవించాడు. అతని చూపులు నిప్పుల్ని రాలుస్తున్నాయి. వజ్రాల వంటి కోరలు, వాడిపిడిబాకుల వంటిగోళ్ళు, బలమైన బాహువులు, ప్రళయగర్జన వంటి కంఠస్వరంతో, బంగారు రంగు గలిగిన జడలతో, చూడ్డానికే భీతి కలిగించే రూపంతోనూ దర్శనమిచ్చాడు శ్రీహరి నృసింహుని రూపంలో.

నరసింహమూర్తి హిరణ్యకశిపుని అమాంతం పట్టుకొని బ్రహ్మ ఇచ్చిన వరాలకు విరుద్ధంగా నరసింహరూపంలో వచ్చి హిరణ్యకశిపుని వధించాడు. ఆయన ఉగ్రరూపాన్ని ఎవ్వరూ శాంతింపచేయలేక పోయారు. చివరకు ప్రహ్లాదుడే ధైర్యంగా ఆయన ముందు నిలబడి శాంతించమని శ్రీనృసింహుణ్ణి స్తుతించాడు. అప్పుడు శ్రీహరి శాంతించి ప్రసన్న రూపంలో ప్రహ్లాదునికి దర్శనం ఇచ్చాడు. ఆ తర్వాత దానవరాజ్యానికి ప్రభువై ప్రహ్లాదుడు ధర్మబద్ధంగా పరిపాలించాడు.

**ఈ కథ గాజుల సత్యనారాయణగారి పెద్దబాలశిక్షనుండి గ్రహించడమైనది.**